సాక్షి మహబూబ్‌నగర్

గురువారం । 12 । జనవరి । 2023



సేవే పరమావధిగా..

నేటి యువత సామాజిక కార్యక్రమాలు చేపడుతూ ముందుకు సాగుతుంది.

వివరాలు 8లో ▸



'ప్రసాద్' పనులు వేగవంతం

జోగుళాంబ ఆలయం వద్ద ప్రసాద్ స్కీం పనులను ఎంపీ రాములు పరిశీలించారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
31.1 /15.6

వాతావరణం

ఉదయం, రాత్రి చలి తీవ్ర అధికంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

భక్తిశ్రద్ధలతో కుడారై ఉత్సవం



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రంలోని సింహగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ధనుర్మాస ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం తెల్లవారుజామున గోదాదేవి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో కుడారై ఉత్సవం నిర్వహించారు. సాయంత్రం మహిళా భక్తులు అమ్మవారికి వడిబియ్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేయడంతో పాటు పల్లకీసేవ నిర్వహించారు. ఈనెల 14వ తేదీన దేవాలయంలో గోదాకల్యాణోత్సవం వేడుకలు నిర్వహించనున్నారు.

పీఈఎఫ్‌ఐ జిల్లా చాప్టర్ కోఆర్డినేటర్‌గా అహ్మద్

మహబూబ్‌నగర్ క్రీడలు: ఫిజికల్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా (పీఈఎఫ్‌ఐ) మహబూబ్‌నగర్ జిల్లా చాప్టర్ కోఆర్డినేటర్‌గా జిల్లా కేంద్రానికి చెందిన సీనియర్ హ్యాండ్‌బాల్ క్రీడాకారుడు మహ్మద్ అహ్మద్ హుస్సేన్ నియమితులయ్యారు. ఈ మేరకు పీఈఎఫ్‌ఐ తెలంగాణ రాష్ట్ర చాప్టర్ కోఆర్డినేటర్ ఎం.రమాకాంత్ నియామక పత్రం జారీ చేశారు. జిల్లా కోఆర్డినేటర్ అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించడం కోసం, ఫిజికల్ ఎడ్యుకేషన్ విద్య ప్రాధాన్యతను క్షేత్రస్థాయిలో తీసుకెళ్లేలా పీఈఎఫ్‌ఐ పనిచేస్తుందన్నారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా జిల్లా చాప్టర్ కోఆర్డినేటర్‌గా నియామకం చేసిన రాష్ట్ర, జాతీయ కోఆర్డినేటర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయ సమస్యలపై నిరంతర పోరాటం



నవాబుపేట: వరుసగా రెండుసార్లు ఎమ్మెల్సీగా సేవలు అందించిన తాను మూడోసారి బరిలో ఉండాలని ఉపాధ్యాయులు కోరుకుంటున్నారని, అందుకే పోటీ చేస్తున్నట్లు ఎమ్మెల్సీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. బుధవారం వివిధ పాఠశాల్లో ఆయన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నవాబుపేటలో మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూనే ఉన్నామని తెలిపారు. తక్కువ హాజరుతో పాఠశాలలు మూతబడే తరుణంలో ప్రభుత్వం ఇంగ్లిష్ మీడియంతో స్కూళ్లు తీసుకొచ్చేందుకు కృసి చేశామన్నారు తెలంగాణ కోసం పోరాటం చేశామని, అలాగే నిత్యం ఉపాధ్యాయుల సమస్యల కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. సీపీఎస్ రద్దు అంశం సైతం సీఎంతో చర్చించినట్లు వివరించారు. సమావేశంలో తెలంగాణ పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా ప్రధానకార్యదర్శి బాల్‌రాజ్, ఆనంద్‌రెడ్డి, ఎంఈఓ రాజునాయక్ తదితరులు ఉన్నారు.

1న విష్ణుసహస్రనామ పారాయణం పోటీలు

స్టేషన్ మహబూబ్‌నగర్: తిరుమల తిరుపతి దేవస్థానం-హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో వచ్చేనెల 1వ తేదీన జిల్లాకేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం పోటీలు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఉత్తరపల్లి రామాచారి తెలిపారు. బుధవాం జిల్లా కేంద్రంలోని టీటీడీ కళ్యాణ మండపంలో పోటీలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10–15 ఏళ్లలోపు శ్రీవిష్ణు సహస్రనామ పారాయణంపై, 10 ఏళ్ల లోపు వారికి అచ్యుతాష్టకం 9 శ్లోకాలపై పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ రెండు విభాగాల్లో ప్రతిభ చాటిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. మిగతా వివరాల కోసం 93475 40005 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. సమావేశంలో శ్రీవారి సేవకులు జి.పాండురంగం, సురేష్ చందర్ దూత్, హనుమంతురెడ్డి, కేశవులు, బి.వెంకటరెడ్డి, చంద్రకళారెడ్డి, భారతమ్మ, నిర్మలమ్మ, లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.



పాలమూరులో కల్తీగాళ్లు..!

- నిర్బంధపు వసూళ్లతో చర్యల ఊసే లేని ఎక్సైజ్ శాఖ
- మరణాలు సంభవించినా మారని తీరు
- నిద్రపోతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ నిఘా
- బలవుతున్న పేద కుటుంబాలు

యథేచ్ఛగా కల్తీ కల్లు, మద్యం విక్రయాలు



నాగర్‌కర్నూల్‌లోని ఓ మద్యం దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కల్తీ కల్లు, కల్తీ మద్యం మాఫియా రాజ్యమేలుతోంది. ఎక్సైజ్ శాఖ ఉదాసీనత షరామామూలుగా మారగా.. వారు ఆడిందే ఆట, పాడిందే పాటగా మారింది. కల్తీ కాటుతో ఏటేటా మరణాలు సంభవిస్తున్నా.. అధికారులు తూతూమంత్రపు తనిఖీలతోనే సరిపెడుతున్నారు. నెలనెలా భారీగా అందుతున్న ముడుపులు వారి చేతులను కట్టిపడేస్తున్నట్లు తెలుస్తోంది. నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇటీవల చోటుచేసుకున్న ఘటనతో పాలమూరులో ఆబ్కారీ శాఖ వ్యవహారశైలి మరోసారి హాట్‌టాపిక్‌గా మారింది. ఓ మద్యం దుకాణం వద్ద లిక్కర్ తాగి ఇద్దరు అనుమానాస్పదంగా మృతి చెందిన విషయం తెలిసిందే. ఎక్సైజ్ అధికారులు కేవలం శాంపిళ్లు సేకరించి ల్యాబ్‌కు పంపించి చేతులు దులుపుకున్నారు. ఆ తర్వాత ఎక్కడా తనిఖీలు నిర్వహించకపోవడం.. తాజాగా ఆ మద్యం దుకాణంలోని లిక్కర్‌లో కల్తీ లేదని తేల్చడంపై విమర్శలు గుప్పుమంటున్నాయి. భారీగా ఆమ్యామ్యాలు అందడంతో ఎక్సైజ్‌లో కీలకంగా వ్యవహరిస్తున్న ఓ అధికారి అన్నీ తానై చక్రం తిప్పి రిపోర్ట్ తారుమారు చేయించారనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

కింది నుంచి పైవరకు వాటాలు

మద్యం వ్యాపారులు, కల్లు డిపోల నిర్వాహకుల నుంచి వసూలు చేస్తున్న మొత్తం ఎక్సైజ్ శాఖలో కింది నుంచి పైస్థాయి వరకు వాటాలుగా తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. పైస్థాయి అధికారులకు ఒక్కో కల్లు డిపో, ఒక్కో వైన్స్ ద్వారా రూ.3వేల నుంచి రూ.5వేల చొప్పున వాటాలు అందుతున్నట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాలో 312 కల్లు డిపోలు, 230 మద్యం దుకాణాలు ఉండగా నెలకు రూ.50లక్షల వరకు ముడుపులు అందుతున్నట్లు అంచనా.

కల్లు డిపో @ రూ.12 వేలు

రిపోర్ట్ తారుమారులో కీలకంగా వ్యవహరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సదరు అధికారే ఎక్సైజ్ శాఖలో అవినీతికి అలవాటు పడిన పలువురితో కలిసి కల్లు డిపోలు, వైన్స్, బార్ల నుంచి నెలనెలా నిర్బంధపు వసూళ్లకు తెగబడినట్లు సమాచారం. జిల్లాల పునర్విభజన క్రమంలో నియోజకవర్గం ఓ జిల్లాలో ఉండగా.. మరో జిల్లాలో చేరిన మండలానికి సంబంధించి ఓ కల్లు డిపో నుంచి ఎక్సైజ్‌శాఖకు నెలనెలా రూ.12 వేలు, సమీపంలోని మరో మండలంలో ఉన్న కల్లు డిపో నుంచి రూ.9వేలు అందుతున్నట్లు తెలిసింది. ఇలా డిపోల పరిధిలో కల్లు సీసాల అమ్మకాలను బట్టి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఓ రేట్ ఫిక్స్ చేసి వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో స్థానిక కల్లు డిపోల నిర్వాహకులు బరితెగించగా.. కల్తీ కల్లు తయారీకి సంబంధించిన ఆల్ప్రాజోలం, సీహెచ్, డైజోఫాం హైదరాబాద్‌తోపాటు జిల్లా సరిహద్దులోని కర్ణాటక రాష్ట్రం నుంచి ఉమ్మడి జిల్లాకు పోటెత్తుతోంది.

వైన్స్ @ రూ.15వేలు

ఎక్సైజ్ శాఖకు వైన్స్, బార్ల నుంచి ముడుపులు నెలకు రూ.15వేలు అందుతున్నట్లు తెలిసింది. ఎక్సైజ్ శాఖలోని కీలక అధికారితో సంబంధాలు నెరుపుతున్న ఉమ్మడి జిల్లాకు చెందిన ఓ మద్యం వ్యాపారి ఈ మేరకు అన్నీ చక్కబెట్టినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. అంతేకాదు.. సదరు వ్యాపారి కనుసన్నల్లోనే కల్తీ లిక్కర్‌కు అడుగులు పడినట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా చీప్ లిక్కర్ అమ్మకాలు ఎక్కువగా సాగుతుండడంతో వాటిలో స్పిరిట్ కలుపుతూ కల్తీ చేస్తున్నట్లు సమాచారం. వైన్స్‌తో పాటు బార్లలో బ్రాండెడ్ కంపెనీలకు సంబంధించిన లిక్కర్ బాటిళ్లలో 40శాతం మేర మద్యం తీసి నీరు కలుపుతున్నట్లు వినికిడి.

- వనపర్తి, మహబూబ్‌నగర్ జిల్లాలో గతంలో కల్తీ మద్యం ట్యాంకులు వెలుగుచూశాయి.
- గతేడాది జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలం పాతపాలెంలో కల్తీ మద్యం తయారీ రాకెట్ పట్టుబడింది.
- కల్తీ కల్లు బారిన పడి జడ్చర్ల, మానవపాడు మండలం జల్లాపురంలో మరణాలు సంభవించాయి. అయినా ఎలాంటి చర్యలు లేవు.

రెండింటికీ ఒక్కరే కావడంతో..

2022 జనవరి నుంచి డిసెంబర్ వరకు ఉమ్మడి జిల్లాలో నకిలీ మద్యంతో పాటు అక్రమ రవాణాకు సంబంధించి 47 కేసులు నమోదు కాగా.. 57 మంది అరెస్ట్ అయ్యారు. 4,069 లీటర్ల లిక్కర్, 7.8 లీటర్ల బీరుతో పాటు 24 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాలో ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. కల్లుకు సంబంధించి కేవలం 16 కేసులు నమోదు కాగా.. 12 షాపుల లైసెన్స్ రద్దు చేశారు. ఎక్సైజ్ అధికారుల తూతూమంత్రపు తనిఖీలకు ఈ గణాంకాలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఎక్సైజ్‌తో పాటు అక్రమాలను అరికట్టే విభాగానికి సంబంధించి ఉమ్మడి పాలమూరులోని ఐదు జిల్లాలకు ఒక్కరే అధికారిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో కల్తీ మద్యం, కల్తీ కల్లుపై నిఘా కరువవడంతో పాటు ఆ శాఖలో అవినీతి పెరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై ఓ అధికారిని సంప్రదించగా.. ఆయన స్పందించేందుకు నిరాకరించారు. ఏదేమైనా కల్తీ కాటుకు బలవుతున్నది సామాన్య, మధ్య తరగతి ప్రజలే. వ్యవసాయ పనులకే కూలీలు, అడ్డా కూలీలు, పారిశుద్ధ్య కార్మికులే ఉంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఎక్సైజ్‌శాఖను ప్రక్షాళన చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పత్తి క్వింటాల్ రూ.8,109



జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం పత్తి క్వింటాల్ గరిష్టంగా రూ.8,109, కనిష్టంగా రూ.4,009 ధరలు లభించాయి. అదేవిధంగా మొక్కజొన్నకు గరిష్టంగా రూ.2,255, కనిష్టంగా రూ.2,051, ధాన్యం హంస రకం గరిష్టంగా రూ.1,909, కనిష్టంగా రూ.1,889, ఆర్ఎన్ఆర్ రకం గరిష్టంగా రూ.2,389, కనిష్టంగా రూ.2,191, వేరుశనగ గరిష్టంగా రూ.8,173, కనిష్టంగా రూ.6,066, కందులు గరిష్టంగా రూ.7,059, కనిష్టంగా రూ.6,769, పెబ్బర్లు గరిష్టంగా రూ.5,230, కనిష్టంగా రూ.4,200, ఉలువలు రూ.4419 ధరలు లభించాయి.

కందుల ధర రూ.7,012

దేవరకద్ర: స్థానికమార్కెట్ యార్డులో బుధవారం జరిగిన ఈనామ్ టెండర్లలో కందుల ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.7012, కనిష్టంగా రూ.6,869గా ధరలు నమోదయ్యాయి. ఆముదాల ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.6,402గా ఒకే ధర పలికింది.

ముగిసిన మైసమ్మ ఉత్సవాలు



నవాబుపేట: మండల పరిధిలో వారం రోజుల పాటు జరిగిన మైసమ్మ దేవత ఉత్సవాలు బుధవారం ముగిశాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసినట్లు దేవాలయ చైర్మన్ గోపాల్, ఆలయ అధికారి మదనేశ్వర్‌రెడ్డి తెలిపారు. కాగా చివరి రోజు హుండీని లెక్కించగా కేజీన్నర వెండి ఆభరణాలు, రూ.లక్ష మూడు వేల నగదు వచ్చిందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కృష్ణయ్య, మాదవులు, నరేందర్, సంజీవరెడ్డి, బాలయ్య, వేణాచారి, వెంకటయ్య, శ్రీను పాల్గొన్నారు.

అంధత్వ నివారణ కోసం 'కంటి వెలుగు'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, చిత్రంలోజెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి

భూత్పూర్: రాష్ట్రంలో అంధత్వ నివారణ కోసం కంటి వెలుగు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మున్సిపాలిటీలోని రైతువేదికలో రెండో విడత కంటివెలుగు కార్యక్రమాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డితో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు వైద్యంతో పాటు కంటి పరీక్షలు చేయించుకోవడానికి పట్టణ ప్రాంతాలకు వెళ్లేందుకు ఇబ్బందులు కలగరాదనే ఉద్దేశంతో కంటి వెలుగు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మూసాపేట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 16 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను, 25మందికి కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కదిరె శేఖర్‌రెడ్డి, మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, చంద్రమౌలి తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిదేళ్లకే.. నూరేళ్లు నిండాయి

- విద్యుత్ తీగలు తలకు తాకి బాలిక మృతి
- ప్రాణాలతో బయటపడ్డ మరో ముగ్గురు చిన్నారులు

గట్టు: చేతికి అందేంత ఎత్తులో వేలాడుతున్న విద్యుత్ తీగలు ఆ బాలిక పాలిట యమపాశాలుగా మారాయి. తోటి చిన్నారులతో సరదాగా ఆడుకుంటున్న బాలిక తలకు విద్యుత్ తీగలు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందింది. అల్లారుముద్దుగా పెంచుకున్న తమ కూతురికి తొమ్మిదేళ్లకే నూరేళ్లు నిండాయంటూ ఆ తల్లిదండ్రులు రోదనలు మిన్నంటాయి. బుధవారం చోటుచేసుకున్న ఈ ఘటనలో మరో ముగ్గురు చిన్నారులు రెప్పపాటులో ప్రాణాలతో బయటపడ్డారు. పూర్తి వివరాలిలా.. మండలంలోని తుమ్మలచెరువుకి చెందిన డబ్బ రవి, గీత దంపతులకు కుమారుడు, కుమార్తె ప్రియాంక (9) ఉన్నారు. ప్రియాంక స్థానికంగా 3వ తరగతి చదువుకుంటుంది. బుధవారం సాయంత్రం పాఠశాల నుంచి వచ్చిన తర్వాత ఇంటి వెనకాల మరో ముగ్గురితో కలసి కాల్వ గట్టులో ఉన్న మట్టిలో ప్రియాంక ఆడుకునేందుకు వెళ్లింది. ర్యాలంపాడు రిజర్వాయర్ బ్యాక్ వాటర్‌ను గట్టు ఎత్తిపోతల పథకానికి తరలించేందుకు కాల్వను తవ్వుతుండగా.. డబ్బ రవి ఇంటికి కొద్ది దూరంలో కాల్వ నిర్మాణంలో భాగంగా మట్టిని తీసి పక్కనే పోశారు. ఇక్కడే విద్యుత్ తీగలు ఉండగా వాటిని తొలగించకుండానే కాల్వలో మట్టిని తీసుకుంటూ వెళ్లారు. కాల్వ నుంచి మట్టి తీసి పక్కనే వేయగా.. అక్కడ చేతికందేంత తక్కువ ఎత్తులో విద్యుత్ తీగలున్నట్లు గ్రామస్తులు తెలిపారు. వీటిని గమనించకుండా మట్టిలో ఆడుకుంటున్న క్రమంలో ప్రియాంక కాల్వ గట్టుపై నుంచి కిందకు జారే క్రమంలో విద్యుత్ తీగలు తలకు తగిలాయి. దీంతో విద్యుదాఘాతంతో బాలిక అక్కడిక్కడే మృతి చెందింది. దీన్ని గమనించిన తోటి స్నేహితులు రెప్పపాటులో పక్కకు తప్పుకుని ప్రాణాలతో బయటపడ్డారు. వారు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచాం ఇచ్చారు. ఈ సంఘటనతో గ్రామంలో విషాదం నెలకొంది.



తుమ్మలచెరువులో ప్రియాంక మృతదేహం

చైర్‌పర్సన్ వర్సెస్ కౌన్సిలర్లు

- జడ్చర్ల పాలకవర్గంలో బయటపడిన విభేదాలు
- చైర్‌పర్సన్ ఏకపక్ష నిర్ణయాలపై ఆగ్రహం
- మున్సిపల్ సమావేశాన్ని బహిష్కరించిన సభ్యులు



చైర్‌పర్సన్, కమిషనర్‌తో వాగ్వాదం చేస్తున్న కౌన్సిలర్లు



సమావేశానికి వెళ్లకుండా బయట కూర్చున్న కౌన్సిలర్లు

జడ్చర్ల టౌన్: జడ్చర్ల మున్సిపాలిటీ పాలకవర్గం సభ్యుల్లో విభేదాలు మరోసారి బయటపడ్డాయి. చైర్‌పర్సన్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని విమర్శిస్తూ మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని ప్రతిపక్ష సభ్యులతో పాటు అధికారపార్టీ సభ్యులు సైతం బహిష్కరించటంతో వాయిదా వేయాల్సి వచ్చింది. కలెక్టర్ వెంకట్రావ్ ఆదేశాల మేరకు బుధవారం జడ్చర్ల మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించేందుకు చైర్‌పర్సన్, కమిషనర్ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు సభ్యులకు సమాచారం అందించారు. కౌన్సిల్ సమావేశం కోసం వచ్చిన సభ్యులు సమావేశపు హాల్‌లోకి వెళ్లకుండా బయటనే ఉండిపోయారు. అదే సమయంలో మున్సిపల్ కార్మికులు తమ సమస్యలపై ఆందోళనకు దిగారు. వారు ఆందోళన విరమించాక కౌన్సిల్ సమావేశం నిర్వహించేందుకు చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మి, ఏడుగురు కౌన్సిలర్లు సమావేశం హాల్‌లోకి వెళ్లారు. మిగిలిన 18 మంది కౌన్సిలర్లు సమావేశానికి రాకపోవడంతో.. చైర్‌పర్సన్ వారిని పిలిచినప్పటికీ వెళ్లకుండా అక్కడే ఉండిపోయారు. ఆ తర్వాత కొందరు సభ్యులు వెళ్లి చైర్‌పర్సన్, కమిషనర్‌తో వాగ్వాదానికి దిగారు. ఒంటెద్దు పోకడలకు వెళ్తున్నారని, ఎవరికి సమాచారం ఇవ్వకుండానే నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుకూలంగా ఉన్న కొందరికి మాత్రమే చెబుతూ మిగిలిన వారికి ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని మండిపడ్డారు. అభివృద్ధి పనుల విషయంలోనూ అలాగే వ్యవహరిస్తున్నారని, ప్రజాసమస్యల పరిష్కారంలోనూ శ్రద్ధ చూపటం లేదని, ఇలాగే ఉంటే కౌన్సిల్ ఎందుకు అంటూ వారు నిలదీశారు. ఏకపక్ష నిర్ణయాలకు స్వస్తి చెప్పాలని బీజేపీ, కాంగ్రెస్ కౌన్సిలర్లతో పాటు అధికార బీఆర్ఎస్ కౌన్సిలర్లు సైతం వాగ్వాదానికి దిగి.. తాము సమావేశాన్ని బహిష్కరిస్తున్నామని చెప్పి బయటకు వెళ్లిపోయారు. కమిషనర్ మహమూద్ షేక్, చైర్‌పర్సన్ లక్ష్మి వారిస్తున్నా వినకుండా వెళ్లిపోవడంతో సమావేశం వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

- జడ్చర్ల మున్సిపాలిటీలో 27 మంది కౌన్సిలర్లు ఉండగా.. ఇద్దరు బీజేపీ, ఇద్దరు కాంగ్రెస్, 23 మంది బీఆర్ఎస్‌కు చెందిన వారు. ఇందులో మెజార్టీ సభ్యులు చైర్‌పర్సన్ లక్ష్మి నిర్ణయాలను వ్యతిరేకిస్తున్నారు. మున్సిపల్ కౌన్సిల్ ఏర్పడి 19 నెలల కాలంలోనే పలుమార్లు చైర్‌పర్సన్‌కు కౌన్సిలర్లకు పొసగక పోవటంతో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. అయినప్పటికీ విభేదాలు తగ్గలేదు. అభివృద్ధి విషయంలో తాము అన్ని వార్డుల్లోనూ సమానంగా చూస్తున్నామని, ఎలాంటి వివక్ష చూపటం లేదని చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మి తెలిపారు. బీజేపీ కౌన్సిలర్ కుమ్మరి రాజు, కొందరు అధికార పార్టీ కౌన్సిలర్లు మాట్లాడుతూ ఒకరిద్దరు కౌన్సిలర్లకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటూ తమకు ఎలాంటి సమాచారం ఇవ్వటం లేదని.. అందుకే సమావేశం బహిష్కరిస్తున్నామని తెలిపారు.

జాతీయస్థాయి కబడ్డీకి జిల్లా క్రీడాకారులు



మహేష్



సంగీత

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లోని శిల్పారామంలో ఈనెల 9, 10 తేదీల్లో రాష్ట్రస్థాయి యువజన సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు జిల్లాకు చెందిన కాట్రావత్ మహేష్, కె.సంగీత ఎంపికైనట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వీరు కర్నాటక రాష్ట్రం హుబ్లిలో నేటి నుంచి ఈనెల 16వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి యువజనోత్సవాల్లో పాల్గొంటారని తెలిపారు.

ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడితే చర్యలు: ఎస్పీ

మహబూబ్‌నగర్ క్రైం: ట్రాఫిక్ ఉల్లంఘనలో భాగంగా ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్లు మార్పిడి చేసి పట్టణంలో రాష్ డ్రైవింగ్ చేస్తూ, పెద్దపెద్ద శబ్దాలు చేసుకుంటూ పాదాచారులను భయాందోళనకు గురి చేస్తున్న రెండు వాహనాలను బుధవారం పోలీసులు సీజ్ చేశారు. వన్‌టౌన్, టూటౌన్ పోలీసులు చేసిన తనిఖీల్లో ఈ రెండు వాహనాలు పట్టుబడటంతో బైక్‌లు అదుపులోకి తీసుకోవడంతో పాటు సదరు వాహనాలు నడిపిన వ్యక్తులపై కేసులు నమోదు చేశారు.

- ఈ నెల 9న మహబూబ్‌నగర్ పట్టణంలో పోలీసులు చేపట్టిన డ్రంక్‌అండ్ డ్రైవ్ తనిఖీల్లో 11మంది మద్యం తాగి వాహనాలు నడుపుతుంటే పట్టుకున్నారు. వీరందరినీ బుధవారం మహబూబ్‌నగర్ ఎక్సైజ్ కోర్టులో హాజరుపరచగా.. 9 మందికి జారిమానాలు విధించగా.. ఇద్దరు వాహనదారులకు ఐదు రోజుల జైలు శిక్ష, రూ.5,000 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలో ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడే వ్యక్తులపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



సైలెన్సర్ లేకుండా బైక్ నడుపుతున్న యువకుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

మా గ్రామం ఎటు?

- వివరాలు 10లో

క్లుప్తంగా

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

అడ్డాకుల: ఆస్పత్రిలో వృద్ధుడు చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఎస్‌ఐ విజయకుమార్ వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన వాకిటి నర్సింహ(75) ఇంట్లో ఒంటరిగా జీవిస్తున్నాడు. ఏడాది కిందట ఆయన భార్య, ఐదేళ్ల కిందట కుమారుడు మృతి చెందారు. ముగ్గురు కుమార్తెలకు పెళ్లిళ్లు అయ్యాయి. వివిధ కారణాలతో జీవితంపై విరక్తి చెంది వృద్ధుడు నర్సింహ్మ ఈ నెల 5న ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన అతని తమ్ముడి కుమారులు వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో బుధవారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పోక్సో కేసు నిందితుడు రిమాండ్‌కు..

జడ్చర్ల: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను వేధించడంతో పాటు అత్యాచారానికి పాల్పడిన నిందితుడు వంశీని బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

హైనా దాడిలో దూడ మృతి

వెల్దండ: హైనా దాడిలో దూడ మృతి చెందిన ఘటన మండలంలోని కేస్లీతండాలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం తండాకు చెందిన రైతు కేశ్య నాయక్ రోజుమాదిరిగా పశువులపాకలో పాడి ఆవులను కట్టేసి వెళ్లాడు. బుధవారం ఉదయం పశువుల పాకకు బాధిత రైతు రాగా అప్పటికే మృతి చెందిన దూడ కనిపించింది. ఈ విషయాన్ని అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఫారెస్టు బీట్ ఆఫీసర్ లలిత సంఘటన స్థలానికి చేరుకొని అక్కడ లభించిన ఆధారాల ప్రకారం దూడపై హైనా జంతువు దాడి చేసిందని అధికారులు గుర్తించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని పలువురు రైతులు కోరారు.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

కేటీదొడ్డి: కర్ణాటక నుంచి కర్నూలుకు అక్రమంగా తరలిస్తున్న నిషేధిత గుట్కా ప్యాకెట్లను బుధవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని నందిన్నె చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలు చేపడుతున్న క్రమంలో ఓ కారులో నిషేధిత గుట్కాప్యాకెట్లు పట్టుబడ్డాయి. వాటి విలువ సుమారు రూ. లక్ష ఉంటుంది. రాయచూర్ నుంచి కర్నూలు వైపు తీసుకెళ్తున్న చంద్రశేఖర్, వెంకటేష్‌ను విచారించి స్వాధీనం చేసుకున్న గుట్కా ప్యాకెట్లను జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నందన్‌కు అప్పగించినట్లు వివరించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

జడ్చర్ల: కుర్వగడ్డపల్లి గ్రామ సమీపంలో గల దుందుబీ వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ రమేశ్‌బాబు తెలిపారు. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ట్రాక్టర్లను స్వాధీన పర్చుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు.

యాజమాన్యం వేధింపులతోనే మృతి

- న్యాయం చేయాలని విద్యార్థి తల్లి పోలీసులకు ఫిర్యాదు
- కేసు నమోదు చేసి పోస్టుమార్టం చేయించిన పోలీసులు

బల్మూర్: మండలంలోని పోలిశెట్టిపల్లి శివారులోని జీఎంజే ప్రైవేట్ పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థి ఆకాష్(15) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై పాఠశాల యాజమాన్యం వేధింపులు నిర్లక్ష్యమే కారణమని విద్యార్థి తల్లి, కుటుంబ సభ్యులు, విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ఈసంఘటనపై తమకు న్యాయం చేసి పాఠశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ విద్యార్థి తల్లి ఫిర్యాదు మేరకు బుధవారం అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ శివానందంగౌడ్ తెలిపారు. కాగా పాఠశాలలో ఉండాల్సిన విద్యార్థి అందులో కనిపించకుంటే వెతకాల్సిన యాజమాన్యం, సిబ్బంది పట్టించుకోక పోవడంతో ఆకాష్ బయటికి వెళ్లి ఆత్మహత్యకు పాల్పడటం జరిగిందని ఆగ్రహం వెలిబుచ్చుతున్నారు. విద్యార్థుల కదలికలపై సిబ్బంది ఎప్పుడూ నిఘా ఉంచాల్సి ఉంటుదన్నారు. కానీ ప్రైవేట్‌గా నిర్వహిస్తున్న ఈ పాఠశాలలో అనుబంధంగా హాస్టల్ నిర్వహిస్తున్న జేఎంజేలో నిత్యం విద్యార్థులు వేధింపులకు గురవుతున్నారని, దీనివల్లే ఆకాష్ ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆరోపిస్తున్నారు. ఈసంఘటనపై విచారణ జరిపించి తగిన న్యాయం చేయాలని, పాఠశాలలో గతంలో వివాదాస్పద సంఘటనలు జరిగినా అధికార పార్టీ నాయకుల అండతో యాజమాన్యం బయటికి పొక్కకుండా చేసిందని విద్యార్థి సంఘల నాయకులు, తల్లిదండ్రులు ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలోనే విద్యార్థి ఆత్మహత్యపై పాఠశాలలోని సీసీ కెమెరాలను పరిశీలించాలని, విచారణ చేసి యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని కుటుంబసభ్యులు, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

సేవే పరమావధిగా..

- సామాజిక సేవలో ముందున్న యువత
- పలువురు యువకులు కలిసి సంఘంగా ఏర్పడి..
- కరోనా కాలంలో ఆక్సిజన్ సరఫరా
- పేద విద్యార్థులకు చేయూత
- నేడు జాతీయ యువజన దినోత్సవం


మొక్క నాటుతున్న యూత్ ఫర్ సేవ సభ్యులు

కల్వకుర్తి రూరల్/నవాబ్‌పేట/ఆత్మకూర్: చిన్నప్పటి నుంచే సేవాగుణాన్ని అలవర్చుకున్నారు. తోటి వారికి సాయం చేస్తే కలిగే సంతృప్తి ఎందులోనూ దొరకదనే సంకల్పంతో సామాజిక కార్యక్రమాలు చేపడుతూ ముందుకు సాగుతున్నారు.

పేరులోనే సేవ..

కల్వకుర్తికి చెందిన 15 మంది యువకులు 2015లో 'యూత్ ఫర్ సేవ' అనే సంస్థను ఏర్పాటు చేసుకొని ఆ ప్రాంతంలో వివిధ రకాల సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రతి ఏటా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 250 మంది పేద విద్యార్థులకు బ్యాగులు అందించడంతో పాటు ప్రతిభ పరీక్షలు నిర్వహించి స్కాలర్‌షిప్‌లు అందించి చేయూతనందిస్తున్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు 'చిగురు' అనే పేరుతో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు.

❐ యూత్ ఫర్ సేవ స్థాపించిన 15 మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే. వారాంతపు సెలవు రోజుల్లో పుట్టిన ఊరికి ఏదైనా చేయాలనే సంకల్పంతో పాటు యువతలో సేవాభావాన్ని పెంపొందించేలా చర్యలు చేపడుతున్నారు. తమకు వచ్చే వేతనాల్లో కొంత సేవలకు వినియోగిస్తున్నారు.

కరోనా కాలంలోనూ..

కరోనా రెండోవిడతలో చాలామంది ఆక్సిజన్ కోసం ఇబ్బందులు పడ్డారు. దాతల సహకారంతో యూత్ ఫర్ సేవ సంస్థ వారు 10 ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు కొనుగోలు చేసి అవసరం ఉన్న వారికి అందించారు. వాల్ ఆఫ్ ఫ్రీ మాస్క్ పేరుతో మాస్కులు, శానిటైజర్లు విద్యార్థులు, ప్రజలకు పంపిణీ చేశారు. వంద మంది జూనియర్ లెక్చరర్లకు నిత్యావసర సరుకులు అందించారు. కరోనా నుంచి కోలుకున్న వారితో మొక్కలు నాటించి పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను వివరించారు. వినాయక చవితి రోజున మట్టి ప్రతిమలు, చలికాలంలో పేదలకు దుప్పట్లు అందజేశారు. రక్తదాన శిబిరాలు, విద్యార్థులకు సైక్లింగ్ పోటీలు నిర్వహించారు.

సేవలకు సత్కారం..

యూత్ ఫర్ సేవ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవలకుగాను 2021 స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ఉత్తమ సేవాసంస్థగా అవార్డు అందజేశారు. కరోనా కాలంలో సేవలకుగాను తెలంగాణ సోషల్ ఇంపాక్ట్ గ్రూప్ నుంచి అవార్డు అందుకున్నారు.

సేవలతో సంతృప్తి..



తోటి వారికి సాయం చేయాలనే సంకల్పంతో ఏడేళ్ల కిందట యూత్ ఫర్ సేవ స్వచ్ఛందసంస్థను స్థాపించి సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నాం. సేవలతోనే సంతృప్తి లభిస్తుంది. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నాం.
– సందీప్, యూత్ ఫర్ సేవ


నవాబుపేట మండలం కొండాపూర్‌లో రక్తదానం చేస్తున్న యువకులు (ఫైల్)

రక్తదాన శిబిరాల్లో..

నవాబుపేటలోని స్వామి వివేకానంద సేవా సమితి 1995లో 13 మంది సభ్యులతో ఏర్పాటై ప్రస్తుతం 62 మందితో కొనసాగుతుంది. ఏటా వివేకానంద, నేతాజీ, అంబేడ్కర్ తదితర దేశ నాయకుల జన్మదినోత్సవాల సందర్భంగా పలు రకాల సేవల కార్యక్రమాలు చేపడుతుంటారు. ఇప్పటి వరకు పదకొండు మార్లు మెగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. రక్తదానం చేసేందుకు సంఘ సభ్యులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. స్వచ్ఛభారత్, ఈచ్ వన్.. టీచ్ టెన్ అనే నినాదంతో ఎయిడ్స్‌పై విస్తృత ప్రచారం చేపట్టి అందరి మన్ననలు పొందారు. గతేడాది దాతల సహకారంతో ఇంటర్ పరీక్ష సమయంలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించారు. పలుమార్లు ఉత్తమ అవార్డులు అందుకున్నారు.

రక్తదానానికి సిద్ధం..



రక్తదానం చేసేందుకు సంఘం సభ్యులు 10 మందికి పైగా ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటారు. పేద ప్రజలు ఎక్కడ ఆస్పత్రిలో ఉన్నా సొంత ఖర్చులతో వెళ్లి రక్తదానం చేయడమే మా ముఖ్య ఉద్దేశం.
– శివాజీ, నవాబ్‌పేట

సమాజసేవే లక్ష్యంగా..



మండలంలో సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు వెళ్తుంటాం. అలాగే ఎక్కడ విపత్తులు జరిగినా సేవ చేసేందుకు వెళ్తాం. కారోనా సమయంలో పారిశుద్ధ్య కార్యక్రమాల్లో పాల్గొన్నాం.
– నర్సింహ, నవాబుపేట

ఆరేళ్లుగా..

ఆత్మకూర్‌కు చెందిన డాన్స్ మాస్టర్ బాలు, మ్యాడం శ్రీను తదితరులు స్వామి వివేకానంద సేవాసమితిని ఆరేళ్ల క్రితం ఏర్పాటుచేసి సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. గ్రామాల్లో రహదారులకు ఇరువైపులా ఉన్న ముళ్లపొదలు, రహదారిపై పేరుకుపోయిన చెత్తా చెదారం తొలగిస్తున్నారు. ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి గాను దుస్తులతో తయారుచేసిన సంచులను పంపిణీ చేస్తున్నారు. తలసేమియా బాధితులు రక్తం అందక ఇబ్బందులు పడుతున్నారన్న విషయం తెలుసుకొని ఆత్మకూర్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటుచేసి 100 మందితో రక్తదానం చేయించారు. స్వామి వివేకానంద జయంతిన క్రీడా, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తూ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేసి ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను ప్రముఖులతో సన్మానింపజేసి మిగతా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పలుమార్లు సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని యువకులు తెలిపారు.


వీధులను శుభ్రం చేస్తున్న వివేకానంద సేవాసమితి సభ్యులు

సేవ చేయడం అదృష్టం..



యువతను చెడు అలవాట్లకు దూరం చేస్తూ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తున్నాం. సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన, వైద్య శిబిరాలు, పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతూ విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నాం. సమాజ సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నాం.
– బాలు, అధ్యక్షుడు, స్వామి వివేకానంద సేవాసమితి

ప్రసాద్ స్కీం పనులు వేగవంతం చేయండి

నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు


ప్రసాద్ స్కీంలో భాగంగా నిర్మిస్తున్న నిర్మాణ నమూనాలను ప్రదర్శిస్తున్న ఎంపీ రాములు

అలంపూర్: ప్రసాద్ స్కీం పనులు వేగవంతం చేయాలని నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు అన్నారు. దక్షిణ కాశీ అలంపూర్ క్షేత్ర ఆలయాలను ఆయన బుధవారం దర్శించుకోగా.. ఆలయ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి ఆలయ అర్చకులతో కలిసి స్వాగతం పలికారు. అనంతరం ఆలయ సుముదాయంలో జరుగుతున్న ప్రసాద్ స్కీం పనులను పరిశీలించారు. ప్రసాద్ స్కీంలో భాగంగా చేపడుతున్న పనులను వివరాలను అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పనులు సరిగ్గా చేయడం లేదనే ఆరోపణలు వస్తున్నాయని, నాణ్యతగా చేపట్టాలన్నారు. ప్రభుత్వం ప్రసాద్ స్కీం ద్వారా రూ. 37 కోట్లు మంజూరు చేసి పనులు చేపడుతుందన్నారు. చాలా కాలంగా ప్రతిపాదనల్లో ఉన్నా తన హయాంలో నిధులు మంజూరై పనులు జరగడం అదృష్టింగా భావిస్తున్నట్లు తెలిపారు. భారీ వర్షాలు కురడంతో పనులు చేపట్టడంలో కొంత జాప్యం జరిగిందన్నారు. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో మరింత వేగంగా చేయాలన్నారు. ఏప్రిల్ వరకు పనులు పూర్తి చేసి ప్రభుత్వానికి అప్పగించాలన్నారు. భవిష్యత్తులో ఈ ప్రాంతానికి కావాల్సిన రింగ్ రోడ్డు, డ్రైనేజీ, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి స్థానిక ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధుల సహకారంతో వాటికి నిధులు వచ్చే విధంగా కృషి చేస్తానన్నారు. చిన్న చిన్న పనులు చేపట్టడానికి పురావస్తు శాఖ నుంచి అభ్యంతరాలు ఉన్నాయన్నారు. వాటి పరిష్కారానికి తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

కేజీబీవీ పాఠశాల సందర్శన

అలంపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న కేజీబీవీ పాఠశాలను ఎంపీ రాములు సందర్శించారు. అక్కడి ఉపాధ్యాయులు, విద్యార్థులతో సౌకర్యాల కల్పనపై మాట్లాడారు. కలెక్టర్, డీఈఓతో ఫోన్‌లో మాట్లాడి.. కేజీబీవీకి వెళ్లడానికి ఉన్న మార్గంలో సీసీ రోడ్డు, పాఠశాల ఆవరణలో వేదిక వద్ద సీసీ బెడ్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తే నిధులు మంజూరు చేస్తానన్నారు. వీరితో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ, ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, వెంకట్రామయ్య శెట్టి, అల్లబకష్, దేవరాజు, మద్దిలేటి, హరిబాబు, రాజేష్ ఉన్నారు.

'దళితబంధు' విధివిధానాలు ప్రకటించాలి

మహబూబ్‌నగర్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం దళిత బంధు విధివిధానాలు ప్రకటించి, అర్హులైన నిరుపేద దళితులకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని అరుంధతిభవన్‌లో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెపోగు శ్రీనివాస్‌మాదిగ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన దళితబంధు పథకం ఎమ్మెల్యేల ప్రమేయం కల్పించడంతో నీరుగారుతున్న సందర్భాలు చాలా చూస్తున్నామని తెలిపారు. నిరుపేద దళితులను దళితబంధు పథకానికి ఎంపిక చేసే విధానంలో కలెక్టర్‌లకు పూర్తి అధికారాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. భర్త లేని, ఒంటరి మహిళలకు, దివ్యాంగులకు, వృద్ధులకు పెన్షన్ ఇస్తున్నట్టే అర్హులైన నిరుపేద దళితులను గుర్తించి ఈ పథకానికి ఎంపిక చేయాలని అన్నారు. దళితబంధు పథకంలోని విధివిధానాలను ప్రకటించాలంటూ వచ్చేనెల 14న ఇందిరా పార్కులో ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం ధర్నా కరప్రాలను విడుదల చేశారు. సమావేశంలో భగవంతు, హుస్సేన్, జంబులయ్య, రవికుమార్, రాజ్‌కుమార్, కృష్ణ, వెంకటేష్, యాదయ్య, రేణుక తదితరులు పాల్గొన్నారు.



వాతావరణానికి అనుగుణంగా సాగు


అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

బిజినేపల్లి: రైతులు మూసా పద్ధతిలో కాకుండా వాతావరణానికి అనుగుణంగా ఆయా నేలలను బట్టి పంటలను సాగు చేసుకోవాలని పాలెం ఆర్‌ఏఆర్ఎస్ ఏడీఆర్ డా.గోవర్ధన్ తెలిపారు. బుధవారం పాలెం ఆర్‌ఏఆర్ఎస్ ఆధ్వర్యంలో మండలానికి చెందిన రైతులకు ఏర్పాటు చేసిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో రెండవ రోజు సమగ్ర వ్యవసాయ సాగుపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ నేలలను సారవంతం లేని చోట కోళ్లు, గొర్రెలు, చేపల పెంపకం వంటి వాటిని ప్రోత్సహించాలని సూచించారు. నీటి కుంటలు, సమగ్ర వ్యవసాయం, పాడి పశువుల పెంపకం, వాటిలో యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నూనె గింజల ప్రధాన శాస్త్రవేత్త సుజాత, శాస్త్రవేత్త ఉదయ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయంలో సూచనలు, సలహాలు కీలకం

రైతులు సాగు చేసే పంటల విషయంలో శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారుల సూచనలు సలహాలు తప్పనిసరిగా పాటించాలని పాలెం కేవీకే శాస్త్రవేత్త రాజశేఖర్ తెలిపారు. బుధవారం తిమ్మాజిపేట మండలంలోని ఆవంచలో ఆయా ధాన్యం పంటల సాగు నుంచి చీడ పీడలను నివారించడానికి అవసరమైన పురుగు మందులను ఉచితంగా అందజేశారు. ప్రస్తుతం మినుము, ఆముదం పంటలో ఆశించిన పురుగులకు క్లోరో పైరిపాస్, బెంజర్, 19-19-19 మందులను వారు ఉచితంగా అందజేయాలని సూచించారు.

ట్రాక్టర్ డ్రైవర్‌కు జరిమానా

అడ్డాకుల: మూసాపేట మండలంలోని పోల్కంపల్లి గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్‌కు పోలీసులు జరిమానా విధించారు. గ్రామానికి సమీపంలోని బీటీరోడ్డుపై బుధవారం కేజీవీల్స్ ఉన్న ట్రాక్టర్ వెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. దీంతో డ్రైవర్ శేరి మల్లయ్యకు రూ.1000ల జరిమానా విధించినట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు.


ట్రాక్టర్‌ను పట్టుకున్న పోలీసులు

యాసంగి పంటలలో సస్యరక్షణ చర్యలు

- మిరపలో కొమ్మ ఎండు తెగులు
- జొన్నలో కాండం తొలుచు పురుగు


సాగు చేసిన జొన్న పంట

అలంపూర్: యాసంగి పంటలను రైతులు సాగు చేస్తున్నారు. పంటకు సోకే వివిధ తెగుళ్లపై అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. పంట సస్యరక్షణ చర్యలను వివరిస్తున్నారు. ముందు జాగ్రత్తగా పంటలను కాపాడుకుంటే అధిక దిగుబడులు సాధ్యమని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. వివిధ పంటల సాగుపై వ్యవసాయ శాఖ ఏడీఏ సక్రియ నాయక్ ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. ప్రస్తుతం యాసంగిలో రైతులు మిరప పంట అధికంగా సాగు చేశారని తెలిపారు. ఇటీవలే కురిసిన వర్షాలతో గాలిలో తేమ శాతం అధికమైందని దీంతో మిరప పంటలో కొమ్మ ఎండు తెగులు సోకిందని పేర్కొన్నారు. అల్టర్‌నేరియా అనే శిలీంద్రం వలన ఈ కొమ్మ ఎండు తెగులు ఆశించడం వల్ల ముదురు కొమ్మల బెరడుపై గోధుమ రంగు మచ్చలు ఏర్పడతాయి. తెగులు తీవ్రమైనప్పుడు కొమ్మలు ఎండిపోయి కిందకు వాలుతాయి. దీని వలన దాదాపు 50 శాతం వరకు పంట నష్టం జరిగే అవకాశం ఉంటుంది.

ఎండు తెగులు నివారణ

మిరపకు ఎండు తెగులును గుర్తించిన వెంటనే ప్రోపికొనజోల్ 1 మి.లీను లీటర్ నీటిలో కలిపి లేదా డైఫెన్‌కొనజోల్ 0.5 మి.లీ లీటర్ నీటిలో కలిపి లేదా కాపర్ హైడ్రాక్సైడ్ 2 గ్రాములు లీటర్ నీటికి కలపాలి. పది రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలి.

లద్దె పురుగు (లేదా) కాయతొలుచు పరుగు

మిరప పంట చిరుకాయ దశలో ఉంది. అక్కడక్కడ కాయ తొలుచు పురుగు ఆశించింది. ఈ పురుగు కాయలోకి ప్రవేశించి కాయలోపలి పదార్థాన్ని తినడం వలన కాయ నాణ్యత పడిపోతుంది. కాయపై చిన్న చిన్న రంధ్రాలు చేసి ఈ పురుగు లోపలికి ప్రవేశిస్తుంది.


మిరపలో ఎండు తెగులు


జొన్నకు కాండం తొలుచు పురుగు

నివారణ చర్యలు

వేప నూనె 5 మి.లీ లేదా అసిఫేట్ 1.5 గ్రాములు, నువలురాన్ 1 మి.లీ లేదా ఫ్లుబెండమయిడ్ 0.3 మి.లీ లేదా క్లోరాంత్రినిపోల్ 0.3 మి.లీను ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.

పోషకాల పిచికారీ కోసం..

వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత ఎకరానికి 30 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ ఎరువులు వేయాలి. పొలంలో తేమ అధికంగా ఉన్నప్పుడు 19:19:19 పోషకము 5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ తప్పనిసరి.

జొన్నపంటలో..

జిల్లాలో సాగు చేసిన జొన్న పంటకు కాండం తొలుచు పురుగు ఆశిస్తుంది. కాండం తొలుచు పురుగు ఆకుల కొనల ద్వార అంకురం వరకు ప్రవేశించి తినడం వలన మొక్క చనిపోతుంది. యాసంగి సీజన్‌లో ఈ పంట ఉధృతి అధికంగా ఉంటుంది.

పిచికారీ విధానం

కాండం తొలుచు పురుగు నివారణకు కార్బోసల్ఫాన్ గుళికలను ఎకరానికి 5 కిలోలు మొక్క సుడులలో వేయాలి. పురుగు ఉధృతి మరింత ఎక్కువగా ఉన్నప్పుడు క్లోరాంత్రినిపోల్ 0.3 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని ఏడీఏ సూచించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ స్వచ్ఛంద సంస్థలు (NGO's), మహిళా మండళ్ళు, యువజన సంఘాలు, పొదుపు సంఘాలు, రైతు సంఘాలకు ప్రాజెక్టు ప్రపోజల్స్, రిజిస్ట్రేషన్, రెన్యూవల్, ఆడిట్, యాన్యువల్ రిపోర్ట్సు వ్రాయబడును. వివరాలకు : 75692 64856

■ బాలాజీ గోల్డ్ : మీ బంగారం బ్యాంకులో గాని ఏ ఇతర సంస్థలో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును (స్పాట్ క్యాష్), తాకట్టు షిఫ్టింగ్ చేయబడును. 90320 40019.

BUSINESS OFFER

■ LIC నూతన సంవత్సరములో సువర్ణావకాశం. LIC ఏజెంట్‌గా చేరుతున్న వారికి కమీషన్‌తో పాటు 5000/- రూపాయలు స్టైఫండ్ ఇవ్వబడును. జడ్చర్ల, షాద్‌నగర్. సంప్ర॥ 7659066229.

■ పేపర్ ప్లేట్ & LED యంత్రాలను వ్యవస్థాపించి, ప్రతి నెల ఎక్కువ ఆదాయాన్ని సంపాదించండి, ఉచిత ముడి పదార్థాలు 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. ఫోన్ : 7217856207, 9717434570

WANTED

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులకు పేషెంట్స్‌ను చూసుకోవడానికి వర్కర్స్, నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం, జీ. 18K ఏజెంట్ కమీషన్ 8K. ఫోన్: 9848571888, 7569955551.

■ Dherji సైట్ నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. PVR Projects Ltd., మహారాష్ట్ర. ఫోన్: 040-23348080, 23338080 Email:adm.vineela@gmail.com

■ Wanted Operators - (15), Salary-15k, ESI + PF+ Accomidation, Qly: 10+, Ph: 9110783252

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
నాలుగు లైన్లకు రూ. : 200/- (Black & White)
అదనపు లైనుకు రూ. : 50
5% GST అదనం మాత్రమే
వివరాలకు :
మహబూబ్‌నగర్ : 9010234478, 9010522215, 9705135557, 9010869797
జడ్చర్ల : 9010076222
నాగర్‌కర్నూల్ : 9010006785
వనపర్తి : 9010068317
గద్వాల : 9553955603
నారాయణపేట : 9010962007

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించి పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాం. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దని పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు. - సాక్షి మేనేజ్‌మెంట్



తిరుమల ఆలయం వెలుపల తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటేశ్వర రెడ్డి

ముగిసిన వైకుంఠ ద్వార దర్శనం

తిరుమల: వైకుంఠ ఏకాదశి పర్వదినాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన తిరుమల శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం బుధవారం అర్ధరాత్రితో ముగిసింది. గురువారం నుంచి యథావిధిగా శ్రీవారి కార్యక్రమాలు జరగనున్నాయి. తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. టైమ్ స్లాట్ టికెట్లు పొందిన వారికి కేటాయించిన నిర్ణీత సమయంలో త్వరితగతిన దర్శనం లభిస్తోంది. శ్రీవారిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటేశ్వరరెడ్డి దర్శించుకున్నారు. అలాగే కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని కూడా ఆయన దర్శించుకున్నారు. కాగా, డయల్ యువర్ టీటీడీ ఈవో కార్యక్రమం శుక్రవారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు తిరుమల అన్నమయ్య భవనంలో జరుగనుంది. ఈవో ఏవీ ధర్మారెడ్డితో మాట్లాడదలచుకున్న భక్తులు 0877-2263261 ఫోన్ నంబర్లో సంప్రదించవచ్చు.

వాల్తేర్ వీరయ్యకు రూ.25, వీరసింహారెడ్డికి రూ.20

10 రోజులు టికెట్ల ధరలు పెంపునకు అనుమతి

సాక్షి, అమరావతి: వాల్తేర్ వీరయ్య, వీరసింహారెడ్డి సినిమాల టికెట్ల ధరలను 10 రోజులపాటు పెంచుకునేందుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఆ సినిమా నిర్మాతలు తమ సినిమాల బడ్జెట్ వివరాలతో సమర్పించిన దరఖాస్తులను హోం శాఖ కమిటీ పరిశీలించి టికెట్ల ధర పెంపుపై సిఫార్సు చేసింది. దీంతో వాల్తేర్ వీరయ్య సినిమాకు టికెట్‌పై గరిష్టంగా రూ.25 చొప్పున, వీరసింహారెడ్డి సినిమాకు రూ.20 చొప్పున పెంపుదలకు అనుమతినిస్తూ హోం శాఖ బుధవారం ఉత్తర్వులిచ్చింది.

నా'రా'బంధువులే'!

టీడీపీ పెద్దల గుప్పిట్లో బడుగుల అసైన్డ్ భూములు

- అమరావతిలో చంద్రబాబు బృందం అక్రమాలు బట్టబయలు
- జీపీఏ, సేల్‌డీడ్లతో 'పచ్చ ముఠా' దందా
- ఇప్పటివరకు సీఐడీ గుర్తించిన అసైన్డ్ భూములు 932.72 ఎకరాలు
- వాటి మార్కెట్ విలువ రూ.3,730.88 కోట్లు
- మాజీ మంత్రి నారాయణ సమీప బంధువుల పేరిట 140 ఎకరాలు
- నారాయణ విద్యా సంస్థలు, రామకృష్ణ హౌసింగ్ ఉద్యోగుల ఖాతాలో 200 ఎకరాలు
- టీడీపీ ప్రభుత్వంలో ఇంటెలిజెన్స్ చీఫ్ ఏబీవీ వియ్యంకుడి పేరిట 40 ఎకరాలు
- చంద్రబాబు బినామీలు, సన్నిహితులు, టీడీపీ నేతల పేరిట 540 ఎకరాలు
- అన్యాక్రాంతమైన మొత్తం అసైన్డ్ భూములు 1,400 ఎకరాలు.. మార్కెట్ విలువ రూ.5,600 కోట్లు



సాక్షి, అమరావతి: అసైన్డ్ భూముల్లో వాలిపోయిన భూ రాబందుల అక్రమాలు బహిర్గతమయ్యాయి. బడుగు, బలహీన వర్గాల రైతులను బెదిరించి 932.72 ఎకరాల అసైన్డ్ భూములను పచ్చ గద్దలు కాజేసినట్లు వెల్లడైంది. గ్రామాల వారీగా ఎల్లో గ్యాంగ్ అసైన్డ్ భూముల అక్రమాల చిట్టా రట్టైంది. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో 2014– 18 మధ్య చోటు చేసుకున్న ఈ దారుణాలు సీఐడీ దర్యాప్తులో ఆధార సహితంగా, రియల్ ఎస్టేట్ అక్రమ సామ్రాజ్యం భౌగోళిక సరిహద్దులతో సహా వెలుగు చూశాయి. ఇప్పటివరకు బట్టబయలైన అసైన్డ్ భూములు 932.72 ఎకరాలు. చంద్రబాబు చెప్పిన ప్రకారం వాటి మార్కెట్ విలువ ఏకంగా రూ.3,730.88 కోట్లకు పైమాటే! కొనసాగుతున్న సీఐడీ దర్యాప్తులో మరిన్ని అసైన్డ్ బాగోతాలు వెలుగు చూసే అవకాశాలున్నాయి.

కార్యాలయాల వారీగా రికార్డుల పరిశీలన..

రాజధాని అమరావతి ప్రాంతంలో 2014 నాటికి ఎస్సీ, బీసీ రైతుల పేరిట ఉన్న అసైన్డ్ భూములు గత సర్కారు హయాంలో ఇతరుల పేరుతో సీఆర్‌డీఏ రికార్డుల్లో నమోదు కావడం గమనార్హం. సీఐడీ దర్యాప్తులో గుర్తించిన అసైన్డ్ భూముల రికార్డులను గుంటూరు జిల్లా రెవెన్యూ అధికారులు ప్రత్యేక బృందాల ద్వారా తనిఖీ చేయించారు. అమరావతి పరిధిలో 932.72 ఎకరాల అసైన్డ్ భూములను టీడీపీ పెద్దలు కొల్లగొట్టినట్టు ఇప్పటివరకు నిర్ధారించారు. భూ సమీకరణ కోసం ఏర్పాటైన సీఆర్‌డీఏ కార్యాలయాల వారీగా రికార్డులను పరిశీలించి నిజాలు నిగ్గు తేల్చారు. మొత్తం 23 సీఆర్‌డీఏ కార్యాలయాల పరిధిలో 932.72 ఎకరాల అసైన్డ్ భూములను కాజేసినట్లు ఆధారాలతో సహా నిరూపితమైంది. రాజధాని నిర్మాణం తరువాత అమరావతిలో ఎకరా మార్కెట్ విలువ కనీసం రూ.4 కోట్లకు చేరుతుందని నాడు ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబే ప్రకటించారు. ఆ ప్రకారం టీడీపీ పెద్దలు హస్తగతం చేసుకున్న 932.72 ఎకరాల అసైన్డ్ భూముల మార్కెట్ విలువ రూ.3,730.88 కోట్లకు పైమాటేనని పరిశీలకులు చెబుతున్నారు.

మొత్తం అసైన్డ్ అక్రమాలు రూ.5,600 కోట్లు!

సీఐడీ దర్యాప్తు ముందుకు సాగుతున్న కొద్దీ మరిన్ని అసైన్డ్ భూముల అక్రమాలు వెలుగు చూసే అవకాశాలున్నాయి. అమరావతి పరిధిలో మొత్తం 1,400 ఎకరాల అసైన్డ్ భూముల రికార్డులను తారుమారు చేసినట్లు గతంలోనే సీఐడీ ప్రాథమికంగా గుర్తించింది. ఆ ప్రకారం టీడీపీ నేతలు దక్కించుకున్న అసైన్డ్ భూముల విలువ రూ.5,600 కోట్లని అధికారవర్గాలు వెల్లడిస్తున్నాయి.

'నారా'యణ బంధువులు, బినామీలే..

అసైన్డ్ భూముల అక్రమాల తీగ లాగితే నారా చంద్రబాబు, పొంగూరు నారాయణ బంధువులు, బినామీల ఇళ్లల్లో డొంక కదులుతోంది. బినామీలు, బంధువుల పేరిట అసైన్డ్ భూములను జీపీఏ, సేల్ డీడ్లు ద్వారా హస్తగతం చేసుకున్నట్లు సీఐడీ దర్యాప్తులో వెల్లడైంది. టీడీపీ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన నాటి ఇంటెలిజెన్స్ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు సమీప బంధువు పేరిట కూడా అసైన్డ్ భూములను కొల్లగొట్టారు. నారాయణ విద్యా సంస్థలు, ఆయన సమీప బంధువుకు చెందిన రామకృష్ణ హౌసింగ్ లిమిటెడ్ చిరుద్యోగుల పేరిట అసైన్డ్ భూములను కాజేశారు. ఇప్పటివరకు గుర్తించిన 932.72 ఎకరాల అసైన్డ్ భూముల సేల్‌డీడ్లు, జీపీఏలను సీఐడీ అధికారులు విశ్లేషించగా ఈ అక్రమాలు వెలుగుచూశాయి.

'ఎన్‌స్పైర'లో కీలక ఆధారాలు స్వాధీనం

మాజీ మంత్రి పి.నారాయణ కుటుంబానికి చెందిన హైదరాబాద్‌లోని 'ఎన్ స్పైర' మేనేజ్‌మెంట్ సర్వీసెస్ కార్యాలయంలో సీఐడీ అధికారుల సోదాలు బుధవారం ముగిశాయి. కంప్యూటర్ హార్డ్‌డిస్క్‌లు, బ్యాంకు ఖాతా లావాదేవీల పత్రాలు, ఇతర కీలక రికార్డులను సీఐడీ అధికారులు స్వాధీనం చేసుకుని విశ్లేషిస్తున్నారు. మునుముందు మరిన్ని కీలక అంశాలు బహిర్గతమవుతాయని భావిస్తున్నారు.

అమరావతిలో ఎల్లో గ్యాంగ్ అసైన్డ్ దందా గ్రామాలవారీగా

గ్రామం	అసైన్డ్ భూములు ఎకరాల్లో
కృష్ణాయపాలెం	9.31
నవులూరు–1	29.30
నవులూరు–2	12.89
కురగల్లు–1	225.34
కురగల్లు–2	2.14
నిడమానూరు–1	63.43
నిడమానూరు–2	41.62
ఉండవల్లి	5.45
పెనుమాక	2.37
లింగాయపాలెం	153.90
ఉద్దండరాయనిపాలెం	20.31
బోరుపాలెం	1.25
పిచుకలపాలెం	9.99
నెక్కల్లు	17.17
నేలపాడు	17.36
తుళ్లూరు–1	43.19
తుళ్లూరు–2	12.52
అనంతవరం	6.96
రాయపూడి–1	87.26
కొండమరాజుపాలెం	6.47
వెలగపూడి	3.30
వెంకటపాలెం	27.39
మందడం–2	133.80
మొత్తం	932.72



జగనన్న తోడు లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

'చిరు' రుణాల్లో ఏపీ ఫస్ట్

- చిరు వ్యాపారులకు సున్నా వడ్డీ రుణాల్లో దేశ చరిత్రలోనే రాష్ట్రం రికార్డు
- దేశ వ్యాప్తంగా 24.06 లక్షల మందికి రుణాలు.. ఇందులో ఒక్క ఏపీలోనే 15.31 లక్షలు
- జగనన్న తోడు లబ్ధిదారుల ఖాతాల్లో వడ్డీ జమ చేసిన సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: చిరు వ్యాపారులకు సున్నా వడ్డీ రుణాలు ఇవ్వడంలో దేశ చరిత్రలోనే ఆంధ్రప్రదేశ్ రికార్డు సృష్టించిందని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. దేశంలో మొత్తం మీద చిరు వ్యాపారులకు 24.06 లక్షల మందికి రుణాలు ఇస్తే, ఇందులో ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే జగనన్న తోడు పథకం కింద 15.31 లక్షల మందికి రుణాలు ఇచ్చామని స్పష్టం చేశారు. రుణాల లెక్కన తీసుకుంటే దేశ వ్యాప్తంగా 39.21 లక్షల రుణాలకు గాను, ఒక్క మన రాష్ట్రంలో మాత్రమే 24.06 లక్షల మందికి రుణాలు ఇచ్చామన్నారు. జగనన్న తోడు పథకం కింద చిరు వ్యాపారులకు ఆరవ విడత రూ.10 వేల వరకు వడ్డీ లేని రుణాలను ఇచ్చే కార్యక్రమాన్ని బుధవారం ఆయన తన క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభించారు. పూర్తి వడ్డీ భారాన్ని ప్రభుత్వమే భరిస్తూ ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున 3.95 లక్షల మంది చిరు వ్యాపారులు, సంప్రదాయ చేతివృత్తుల వారికి బ్యాంకుల ద్వారా కొత్తగా రూ.395 కోట్ల రుణాలు అందించడంతో పాటు, గత 6 నెలలకు సంబంధించిన రూ.15.17 కోట్ల వడ్డీ రీయింబర్స్‌మెంట్‌ను కంప్యూటర్‌లో బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. చిరు వ్యాపారుల్లో 80 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ అక్కచెల్లమ్మలు, అన్నదమ్ములకు 'జగనన్న తోడు'అందుతోందని తెలిపారు. 3.95 లక్షల మందిలో 3.67 లక్షల మంది సకాలంలో రుణాలు చెల్లించి, మళ్లీ రెండోసారి రుణాలు తీసుకుంటున్నారని చెప్పారు. వీరు కాక మరో 28 వేల మందికి ఇవాళ రుణాలు ఇస్తూ కొత్తగా ఈ పథకంలో తీసుకొచ్చామన్నారు. మొత్తంమ్మీద జగనన్న తోడు ద్వారా దాదాపు 15.31 లక్షల చిరు వ్యాపారుల కుటుంబాలకు మంచి జరుగుతోందని స్పష్టం చేశారు.

47 హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

సాక్షి, అమరావతి: ఏపీ వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో 47 హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ పోస్టుల భర్తీకి వైద్య శాఖ నోటిఫికేషన్ ఇచ్చింది. https://dmeaponline.com వెబ్‌సైట్ లో ఆన్‌లైన్ అప్లికేషన్‌ను అందుబాటులో ఉంచారు. బుధవారం నుంచి దరఖాస్తుల ప్రక్రియ మొదలు పెట్టారు. అర్హులైన వైద్యులు ఈ నెల 17వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఓసీ, బీసీ అభ్యర్థులకు రూ.వెయ్యి, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.750 చొప్పున దరఖాస్తు రుసుం ఉంటుంది. రెండేళ్ల కాలపరిమితితో కాంట్రాక్ట్ ప్రాతిపదిక పోస్టుల భర్తీ చేపడతారు. ఎంబీబీఎస్/బీడీఎస్ పూర్తి చేసి హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్‌లో మాస్టర్ డిగ్రీ/హాస్పిటల్ మేనేజ్‌మెంట్/ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్/ఎంబీఏ హ్యూమన్ రీసోర్స్ కోర్సులు చేసి, ఇతర అర్హతలున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ఏడాది జూలై ఒకటో తేదీ నాటికి గరిష్ట వయోపరిమితి 42 ఏళ్లు మించకుండా ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఎక్స్ సర్వీస్‌మెన్‌లకు మూడేళ్లు, దివ్యాంగులకు 10 ఏళ్లు వయోపరిమితి నుంచి మినహాయింపు ఉంటుంది. http://hmfw.ap.gov.in వెబ్‌సైట్‌లో నోటిఫికేషన్‌ను అందుబాటులో ఉంచారు.

ఉల్లి గరిష్ట ధర రూ.1,970



మార్కెట్‌లో ఉల్లిని తూకం వేస్తున్న వ్యాపారులు

దేవరకద్ర: స్థానిక మార్కెట్ యార్డులో బుధవారం ఉల్లి వ్యాపారం జోరుగా సాగింది. దాదాపు రెండు వందల బస్తాలు అమ్మకానికి వచ్చింది. గతవారం కన్నా ఉల్లి ధర రూ.400 వరకు పెరిగింది. మార్కెట్‌లో జరిగిన బహిరంగ వేలంలో గరిష్ట ధర క్వింటాల్‌కు రూ.1970, కనిష్ట ధర రూ.1,050 గా పలికింది. వేలం తర్వాత తూకం వేసిన 45 కేజీల ఉల్లి బస్తా ధర గరిష్టంగా రూ.1000, కనిష్టంగా రూ.550 వరకు విక్రయించారు. మార్కెట్‌కు వచ్చిన ఉల్లిని వినియోగ దారులతో పాటు చిల్లర వ్యాపారులు ఎక్కువగా ఉల్లిని కొనుగోలు చేశారు.

ప్రసవానికి వస్తే మృతశిశువు జననం



ఆస్పత్రి ఎదుట రోదిస్తున్న కుటుంబసభ్యులు

నాగర్‌కర్నూల్ క్రైం: ఓ గర్భిణికి ప్రసవం చేయగా మృతిచెందిన శిశువు జన్మించింది. ఈ సంఘటన జిల్లాకేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. మండల పరిధిలోని వనపట్ల గ్రామానికి చెందిన పవిత్ర మొదటి కాన్పు కోసం మంగళవారం జనరల్ ఆస్పత్రికి రాగా అడ్మిట్ చేసుకున్న సిబ్బంది, సాయంత్రం నార్మల్ డెలివరీకి ప్రయత్నించారు. పురిటినొప్పులు ఎక్కువకావడంతో ఆపరేషన్ చేశారు. కానీ మృతశిశువు జన్మించాడు. దీంతో వైద్యుల నిర్లక్ష్యం వల్లే మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ సంఘటనకు సంబందించి జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.రఘును వివరణ కోరగా, శిశువు మృతిలో వైద్యుల నిర్లక్ష్యం లేదని, గర్భిణి కడుపులోనే శిశువు మృతిచెంది ఉండటంతో ఆపరేషన్ చేసి, బయటికి తీశారని అన్నారు.

మా గ్రామం ఎటు?



అడవిఖానాపూర్ గ్రామం

- కృష్ణా మండలంలో పంచాయతీ, అనుబంధ గ్రామం మాగనూర్ మండలంలో..
- అడవి ఖానాపూర్ గ్రామస్తుల ఆవేదన
- విద్యార్థులకు కుల, స్థానిక, ఆదాయ ధ్రువపత్రాలకు ఇబ్బందులు

కృష్ణా: మండలంలోని చేగుంట పంచాయతీ అనుబంధ గ్రామమైన అడవి ఖానాపూర్ మాగనూర్, కృష్ణా మండలంలో పూర్తిగా లేకపోవడంతో ఆ గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మాగనూర్ మండలంలో గతంలో ఉన్న 18 పంచాయతీల్లో తొమ్మిదింటిని 2016లో కొత్తగా ఏర్పడిన కృష్ణా కేటాయించగా, మిగితా 9 మాగనూర్ మండలానికి కేటాయించారు. కృష్ణా మండలంలో కృష్ణా, హిందుపూర్, తంగిడి, ఐనాపూర్, చేగుంట, ఆలంపల్లి, కున్సి, గుడెబల్లూర్, ముడుమాల్ ఉన్నాయి. కాగా కృష్ణా మండలంలో చేగుంట పంచాయతీని రికార్డుల్లో చేర్చి, అనుబంధ గ్రామమైన అడవిఖానాపూర్‌ను మరిచారు. ప్రస్తుతం విద్యార్థులు తమ ఉన్నత చదువుల కోసం వారి కుల ధ్రువీకరణ, ఆదాయ, స్థానిక ధ్రువపత్రాలను కృష్ణా మండలానికి వెళ్లినా అక్కడి అధికారులు మీ గ్రామం మా మండలంలో లేదని చెబుతున్నారు. కాగా మాగనూరు మండలంలో గ్రామం ఉందని అక్కడే సంబంధిత ధ్రువపత్రాలు మంజూరు చేస్తారని అధికారులు అంటున్నారు. మా పంచాయతీ కృష్ణా మండలంలో గ్రామాన్ని మాగనూర్ మండలంలో ఉంచడం తగదని, మా గ్రామాన్ని కృష్ణా మండలంలో కొనసాగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నమోదు కాలేదు

అడవి ఖానాపూర్ గ్రామం టెక్నికల్‌గా కృష్ణా మండలంలో నమోదు కాలేదు. అందుకే వారికి మాగనూర్ మండలంలో ధ్రువపత్రాలు ఇచ్చేందుకు ఉన్నతాధికారులు సూచించారు.

– సురేష్‌కుమార్, తహసీల్దార్, కృష్ణా మండలం

తీవ్ర ఇబ్బందులు



మా పంచాయతీ చేగుంటను కృష్ణా మండలంలో ఉంచి, అనుబంధ గ్రామమైన అడవి ఖానాపూర్‌ను మాగనూర్ మండలంలో ఉంచడంతో మాకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఏ చిన్న ధ్రువపత్రం అవసరమైన మాగనూర్‌కు వెళ్లాల్సి వస్తుంది. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి మా గ్రామాన్ని కృష్ణా మండలంలోకి మార్చాలి.

– అంబ్రేష్‌గౌడ, అడవి ఖానాపూర్

సరి చేయడం లేదు



కృష్ణా మండలం ఏర్పడి 6 ఏళ్లు గడుస్తున్నా చిన్న టెక్నికల్ సమస్యను ఉన్నతాధికారులు సరి చేయడం లేదు. పలుమార్లు కలెక్టర్‌కు విన్నవించినా పట్టించుకోవడం లేదు. సమస్యను పైస్థాయిలో పరిష్కరించాలని అధికారులు చెబుతున్నారు.

– తిమ్మారెడ్డి, అడవి ఖానాపూర్

పలుమార్లు విజ్ఞప్తి చేశాం



అడవి ఖానాపూర్‌ను కృష్ణా మండలంలోకి మార్పు చేయాలని పలుమార్లు జిల్లా అధికారులకు విజ్ఞప్తి చేశాం. సమస్యను ఇప్పటి వరకు పరిష్కరించలేదు. దీని మూలంగా మా పంచాయతీకి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. కలెక్టర్ సమస్యలను దృష్టిలో ఉంచుకొని పరిష్కరించాలని కోరుతున్నాం.

– శివప్ప, సర్పంచ్, చేగుంట

ఇథనాల్ కంపెనీని రద్దు చేయాలి

పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్

మరికల్: పర్యావరణానికి ముప్పుగా ఉన్న చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ రద్దు చేయాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మోసపూరితంగా రైతుల నుంచి సేకరించిన భూములు తిరిగి ఇవ్వాలలన్నారు. కోయిల్‌సాగర్ నీటి వనరులు రైతులకే చెందాలని తెలిపారు. కంపెనీ పేరుతో తవ్విన కాల్వలను మూసివేసి రైతుల భూములను పరిరక్షించాలని అధికారులను కోరారు. రైతులపై దురుసుగా ప్రవర్తిస్తున్న పోలీసులపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. ఇథనాల్ కంపెనీ వల్ల ప్రజల జీవితలు బుగ్గిపాలు కావడమే కాకుండా వారి జీవితం ఆగ్యమగోచరంగా మారిందన్నారు. కంపెనీ పనులు పూర్తి అయితే విషతుల్యమైన వాయువులు, వ్యర్థాలను వెదజల్లడంతో ప్రాణాంతక వ్యాధులు వ్యాప్తి చెంది ప్రజలు, అడవి జంతువులకు భారీగా ప్రాణా నష్టం కలిగే అవకాశం ఉందన్నారు. పచ్చని పంటలు పండించే భూములు కంపెనీ వశం కావడంతో వారు జీవనోపాధి కోల్పోయారన్నారు. పనులను అడ్డుకున్న రైతులపై అక్రమంగా పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయకుండా ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నారాయణరావు, తిరుమలయ్య, సుభాష్, బాలయ్య, మహాదేవ్, లక్ష్మీనారాయణ, ఉమాశంకర్, వెంకటేష్, చంద్రశేఖర్, మురళీ, మనివర్ధన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పౌర హక్కుల సంఘం నాయకులు

చెంచులు ఆర్థిక స్వావలంబన సాధించాలి



చెంచులకు వలలు, బోట్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

- నాగర్‌కర్నూల్ కలెక్టర్ ఉదయ్‌కుమార్
- నల్లమల అటవిలోతట్టు ప్రాంతాల్లో పర్యటన

మన్ననూర్: ప్రభుత్వం, ఐటీడీఏతో పాటు ఆర్డీటీ వంటి స్వచ్ఛంధ సంస్థల సహకారంతో చెంచులు తమ జీవన నైపుణ్యాలను పెంచుకుని ఆర్థిక స్వావలంబన సాధించుకోవాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. బుధవారం నల్లమల అటవీ లోతట్టు ప్రాంతాలు మేడిమల్కల, సంఘడిగుండాల తదితర చెంచు పెంటలను ఐటీడీఏ, ఆర్డీటీ సిబ్బందితో కలిసి కలెక్టర్ పర్యటించారు. ఈ సందర్భంగా చెంచులతో సమావేశమయ్యారు. చెంచులు ప్రభుత్వం నుంచి వచ్చే అభివృద్ధి, సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అభివృద్ధికి ఆటంకమైన తాగుడుకు బానిసలు కాకూడదని సూచించారు. ఈ సందర్భంగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, గుడిసెల్లో ఉండలేకపోతున్నామని మేము ఉన్న ప్రాంతంలోనే పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, జీవనోపాధి కోసం ప్రతి కుటుంబానికి 100 రోజుల ఉపాధి పని దినాలు సక్రమంగా కల్పించాలని చెంచులు కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. స్పందించిన ఆయన ఊట బావి, చెక్‌డ్యామ్ ఉన్న ప్రదేశానికి కాలినడకతో వెళ్లి పరిశీలించారు. ఉట్నూర్‌లో ఫ్యాబ్రికేటెడ్ విధానంలో నిర్మించిన ఇళ్లను ఇక్కడి చెంచులు పరిశీలించేందుకు వెళ్లాలని అందుకు వాహన సౌకర్యం ఏర్పాటు చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఫ్యాబ్రికేటెడ్ పద్ధతిలో ఇళ్లు బాగున్నావని అనుకుంటే అటవీ ప్రాంతంలోనే ఆర్డీటీ సంస్థ ద్వారా సుమారు 400 వరకు ఇళ్లు నిర్మించేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. తాగునీటి సమస్య వెంటనే పరిస్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. ఉపాధి పనులు కల్పిస్తామని అందుకుగాను ప్రతి ఒక్కరికి ఉపాధి కూలీ డబ్బులు బ్యాంకులో జమ చేసేందుకు అవసరమైన ఖాతాలు తీయించాలని ఉపాధి అధికారులకు సూచించారు. వ్యవసాయ పొలాలు ఉన్నవారికి రైతుబంధు అందించాలన్నారు. ఈ సందర్భంగా మేడిమల్కల, సంఘిడిగుండాలు, పందిబొర్రె కృష్ణానది సమీప పెంటలలోని 14 చెంచు కుటుంబాల వారికి చేపలు పట్టేందుకు అవసరమైన వలలు, బోట్లు అందజేశారు.

చదువులకు ఆటంకం కలిగించొద్దు

అప్పాపూర్‌లోని ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల చదువుకు ఆటంకంగా సౌకర్యాల లేమి ఉండకూడదని అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బందికి సూచించారు. విద్యార్థులు ప్రస్తుత పరిస్థితుల్లో చలి బారినుంచి కాపాడుకునేందుకు అవసరమైన దుప్పట్లను కలెక్టర్ అందజేశారు.

తేనెటీగల పెంపకం పరిశీలన

మల్లాపూర్ పెంటలో అధునాతన విధానాలతో చేపడుతున్న తేనెటీగల పెంపకాన్ని ఆయన పరిశీలించారు. తేనెటీగల పెంపకం, నాగరిక పద్ధతిలో తేనె సేకరించే విధానం గురించి హైదరాబాద్‌లో శిక్షణ ఇప్పిస్తామని, ఆసక్తి ఉన్న యువకులు సిద్ధం కావాలన్నారు. ప్రభుత్వం ద్వారా రుణాలు తీసుకొని చీపుర్ల లాంటి అటవీ ఉత్పత్తులను విరివిగా తయారు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీటీ సంస్థ రీజనల్ మేనేజర్ పుష్పలత, డీటీడీఓ అనిల్ ప్రకాష్, లింగాల తహసీల్దార్ మునీర్, ఎంపీడీఓ గీతాంజలి, ఐటీడీఏ సీనియర్ అసిస్టెంట్ జాఫర్ హుస్సేన్, కమలాకర్‌రెడ్డి, లక్ష్మయ్య, ఎఫ్ఎస్ఓ రామాంజనేయులు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్



తేనెటీగల పెంపకాన్ని పరిశీలిస్తున్న అధికారులు